
సాక్షి ప్రకాశం

మంగళవారం ; 31 ; డిసెంబర్ ; 2024



పింఛన్‌లో పితలాటకం

కూటమి ప్రభుత్వం 50 ఏళ్లకే పింఛన్ ఊసెత్తడం లేదు సరికదా కొత్తగా పింఛన్ దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. వితంతు మహిళల పింఛన్లలో నూ కోత పెడుతోంది. - 8లో..



బస్సు బోల్తా.. కనిగిరి యువకుడు దుర్మరణం

కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలో బస్సు బోల్తాపడి కనిగిరి యువకుడు మృతిచెందాడు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31/21

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేటి నుంచి బ్యూటీషియన్ కోర్సులకు శిక్షణ

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద మహిళా ప్రాంగణంలో బ్యూటీషియన్ కోర్సులకు సంబంధించి మహిళలకు శిక్షణ తరగతులు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల వయసున్న నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు మొబైల్ నం:9963005209 ను సంప్రదించాలన్నారు.

యూటీఎఫ్ ప్రచార యాత్రను జయప్రదం చేయండి

ఒంగోలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 26 నుంచి 31 వరకు జరిగే యూటీఎఫ్ ప్రచార యాత్రను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీ రాంజనేయులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జనవరి 5, 6, 7, 8 వ తేదీల్లో కాకినాడ నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రచార యాత్ర సోమవారం సాయంత్రానికి కనిగిరి పట్టణానికి చేరుకుంది. మంగళవారం ఉదయం 7 గంటలకు కనిగిరి పట్టణంలో ప్రారంభమయ్యే ప్రచార యాత్రలో జిల్లాలోని యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. 10.30 గంటలకు బేస్తవారిపేట, 12.30 గంటలకు మార్కాపురం, ఒంటి గంటన్నరకు పొదిలికి, 4.30 గంటలకు ఒంగోలు పట్టణం చేరుకుంటుందని, మొత్తం 216 కిలోమీటర్లు దూరం 5 సెంటర్ల గుండా జిల్లా కేంద్రానికి ప్రచార యాత్ర వస్తుందని తెలిపారు. ఆయా సెంటర్లలోని యూటీఎఫ్ కార్యకర్తలు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు భారీగా పాల్గొని ప్రచార యాత్ర జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఆయా సెంటర్లలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరించాలన్నారు. ఈ ప్రచార యాత్రకు జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నుంచి సామంతుల సస్పెన్షన్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొండపి నియోజకవర్గం సింగరాయకొండ మండల పార్టీ అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

రక్తదాన శిబిరాలు నిర్వహించాలి

- ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు 30 శాతం రక్తం ప్రభుత్వానికి ఇవ్వాలి
- డీఎంహెచ్‌ఓ డా.వెంకటేశ్వర్లు



సమావేశం నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు సేకరించిన రక్తం నుంచి 30 శాతం రక్తాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని ఛాంబర్లో ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకు వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు ఎక్కువగా క్యాంపులను నిర్వహించడం ద్వారా రక్త నిల్వలు సేకరించాలని సూచించారు. నెలవారీ నిర్వహించే క్యాంపుల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి తెలియజేయాలని చెప్పారు. బ్లడ్ బ్యాంకు క్యాంపు నిర్వహించే ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఐఈసీ ప్రచారం చేయాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా చైతన్యవంతం చేయాలని చెప్పారు. దాతల పూర్తి చిరునామా, మొబైల్ ఫోన్ నంబర్లు సేకరించాలని ఆదేశించారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు నిర్వహించే క్యాంపుల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి కానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కానీ ఒక అధికారి వచ్చి పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ, బ్లడ్ బ్యాంక్స్ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి సరోజిని, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్, బ్లడ్ బ్యాంకుల వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



కార్యసాధకులై.. లక్ష్య విహంగాలై!

ఉద్యోగం సాధించాలన్న పట్టుదల.. ఎంతటి కష్టమైన లక్ష్యాన్నైనా చేరుకోవాలన్న తపన వారిలో కనిపించింది. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పరేడ్ మైదానంలో సోమవారం దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్ పరీక్షల్లో అభ్యర్థులు పోటీ పడ్డారు. 8లో ▶

ప్రజా సమస్యలు సహేతుకంగా పరిష్కరించాలి



గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రజా సమస్యలు సహేతుకంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేని సమస్య ఉంటే అర్జీదారులను పిలిచి వివరించాలన్నారు. మీకోసం కార్యక్రమానికి హాజరయ్యే విషయంలో అధికారులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. దీనిలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు లోకేశ్వరరావు, పార్థసారథి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. గ్రీవెన్స్ హాలు వద్ద ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల విక్రయాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సేంద్రియ కూరగాయల వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. అర్జీదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అర్జీలు ఉచితంగా రాయడంతో పాటు ఆయా శాఖల కౌంటర్ల వద్దకు తీసుకెళ్లేలా ఏర్పాటు చేశామన్నారు.

ఉపకులాల మధ్య కూటమి చిచ్చు..

ఎస్సీ ఉప కులాల మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చురేపుతోంది. కులగణన పేరుతో చేపట్టిన కార్యక్రమం అంతా తప్పుల తడకగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు అందకుండా చేయాలన్న కుట్రలో భాగంగానే ఈ ప్రక్రియ జరుగుతోందని కుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పారదర్శకత లోపించిందని, నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



- ఎస్సీ కులగణన అంతా గందరగోళం
- తప్పుల తడకగా జాబితా
- ఎటువంటి ప్రచారం లేకుండా అభ్యంతరాల స్వీకరణపై కుల సంఘాల కన్నెర్ర
- ఒకే కుటుంబంలో సభ్యులకు వేర్వేరు కులాలు, మతాలుగా కులగణనలో లెక్కించిన అధికారులు
- సాంకేతిక కారణాలతో ఇబ్బందులు
- నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ గడువు
- మరో పది రోజులు పెంచాలని డిమాండ్

ఒంగోలు అర్బన్:

కులగణనతో ఎస్సీ ఉప కులాల మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చు రేపేందుకు గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోంది. స్పష్టమైన విధానం లేకుండా కులగణనపై అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. జాబితాలో తప్పులు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియలో పారదర్శకత లోపించడం వంటి వాటితో గందరగోళం నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్సీ కులగణనకు సంబంధించి జిల్లాలో తప్పులతడకగా ఉందంటూ అటు ఎస్సీ ప్రజలు, కుల సంఘాల నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కులగణనకు సంబంధించిన జాబితాలను సచివాలయాల్లో ఉంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ప్రకటించారు. అయితే ఈ అభ్యంతరాల స్వీకరణకు సంబంధించి ఏ పల్లెల్లోనూ దండోరాలు వేయించడంకానీ ప్రచారం చేయడం కానీ చేయలేదు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అభ్యంతరాలు స్వీకరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు అడుగడుగునా సాంకేతిక లోపంతో ఈ ప్రక్రియ జాప్యం అవుతోంది. వీటన్నింటినీ అభ్యంతరాల స్వీకరణకు మరో పది రోజుల గడువు పెంచాలని కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అంతా తప్పుల తడక..

జిల్లా యంత్రాంగం ఇప్పటికే ప్రకటించిన ఎస్సీ కులగణన జాబితా తప్పుల తడకగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే కుటుంబంలో సభ్యులకు ఒక్కొక్కరికి ఒక్కో మతంతో జాబితా చేయడం గమనార్హం. భార్య, భర్త, తండ్రి, కూతురు, కుమారుడు ఉంటే వారికి వేరు వేరు కులాలుగా పరిగణించడం వంటి పొరపాట్లతో జాబితా రూపొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా మాదిగ సామాజిక వర్గానికి సంబంధించి క్రిస్టియన్ మాదిగ అని నమోదు చేయడం వంటి ఇతర కారణాలతో జిల్లాలో సుమారు 10 వేల మందికి పైగా మాదిగలు నష్టపోతారని, ప్రభుత్వ పథకాలకు దూరం అవుతారని కుల సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీల్లో మొత్తం 59 ఉపకులాలు ఉండగా కులగణనలో మాత్రం వేలాది తప్పులతో ఒక కులాన్ని తగ్గించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్న అనుమానాన్ని కుల సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. దానిలో ముఖ్యంగా ఆంధ్ర, హిందూ మాదిగ అని కాకుండా క్రిస్టియన్ మాదిగ అని కులగణనలో చూపి మాదిగల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందనే విమర్శలు లేకపోలేదు. దీనిపై మాదిగలు ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కులగణనలో తప్పుల వల్ల ఎస్సీల్లోని మాల, మాదిగలకు, బీసీలకు మధ్యలో చిచ్చు రాజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ నిర్దేశించిన గడువులో పూర్తి చేసేందుకు సచివాలయాల్లో సిబ్బంది కొరత, సాంకేతిక లోపాలు వేధిస్తున్నాయి. అంతేకాకుండా అభ్యంతరాల స్వీకరణకు సంబంధించి సవరణపై వీఆర్‌ఓ, ఆర్‌ఐకు పంపి ఆ తర్వాత తహశీల్దార్లకు పంపాలి. అయితే గ్రామ స్థాయి సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన, స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

సచివాలయాల్లో జాబితాలపై సమాచారం ఏదీ..

వర్గీకరణలో భాగంగా ఎస్సీల జనాభా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించి వాటిని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాల్సి ఉంది. ఎస్సీ కులాల జాబితాపై డిసెంబర్ 31 వరకు అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంది. జాబితా చూసిన వారెవరైనా అభ్యంతరాలు ఇస్తే వీటిని సవరణ కోసం వీఆర్‌వో, ఆర్‌ఐ పరిశీలించి తహసీల్దార్ కు పంపాలి. కానీ ఈ జాబితాపై అభ్యంతరాలు, సవరణలపై నేటికీ గ్రామస్థాయి సచివాలయ సిబ్బందికి స్పష్టత లేదు. సమస్యలు చెప్పుకునేందుకు వీఆర్వోను అడిగితే పంచాయతీ కార్యదర్శిని అడగమని, పంచాయతీ కార్యదర్శిని అడిగితే వీఆర్వోను అడగాలని చెప్తున్నారు తప్పితే ఎవరు ఏ పనిచేయాలో మాకే స్పష్టత లేకుండా ప్రజలకు ఏమి చెప్తామని సచివాలయ సిబ్బంది ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారే గానీ ఎస్సీ జనాభాకు సంబంధించి కులం, మతం వంటి సవరణలపై మాకు ఎలాంటి సమాచారం లేదని చెబుతుండడం గమనార్హం. సచివాలయాల్లో అందుబాటులో ఉన్న ఎస్సీ జాబితాలో చాలా వరకు పేర్లు, కులం తప్పుగా ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా పేర్లు ఎస్సీ క్రిస్టియన్‌గా నమోదయ్యాయి. ఎవరికైనా ఎస్సీ ఫలాలు అందాలంటే ఎస్సీ క్రిష్టియన్ అని కాకుండా ఎస్సీ హిందూగా ఉంటేనే రిజర్వేషన్, వర్గీకరణ ఫలాలు అందేది. ఇలా తప్పులు జరిగితే ఎస్సీ ఫలాలు అందకుండా పోతాయని ఎస్సీలు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల గడువు పెంచి పారదర్శకంగా ఎస్సీ కులగణన చేపట్టాలని కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎస్సీ జాబితాను ప్రచురించాలి

బేస్తవారిపేట: ఎస్సీ కులగణన విషయంలో అధికారులు నిబంధనలు పాటించడం లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి షాలేంరాజ్, జిల్లా కార్యదర్శి నేదరమల్లి జయరాజ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులుకు వినతిపత్రం అందజేశారు. సచివాలయాల్లో ఎస్సీ జాబితాను ప్రచురించలేదన్నారు. కులగణన పూర్తిగా తప్పుల తడకగా ఉందని తెలిపారు. జాబితాను పరిశీలించి సరిచేయాలని, అవసరమైతే మరోసారి కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్వేను నిష్పక్షపాతంగా చేయించి మాల, మాదిగల జనాభా ఎంత ఉందనే లెక్కలు పక్కాగా తేల్చడంతోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల కన్వీనర్ కువ్వారపు రాజు, ఎంపీటీసీ సభ్యుడు కుంపటి సురేష్, నాయకులు మట్టేమల్ల ప్రవీణ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.



ఎంపీడీఓతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

“ మాదిగలకు అన్యాయం జరిగితే సహించం



ఎస్సీ కులగణనలో మాదిగలకు అన్యాయం జరిగితే సహించం. కులగణనలో లోపాలు, ప్రక్రియలోని తప్పులపై కలెక్టర్ స్పందించాలి. కులగణన పారదర్శకంగా లేకపోవడం వల్ల జిల్లాలో 10 వేలకు పైగా మాదిగలు నష్టపోయే అవకాశం ఉంది. సరైన అవగాహనతో కులగణన ప్రక్రియ, అభ్యంతరాల స్వీకరణ చేసి తప్పులను సరిచేయాలి. హడావుడిగా కాకుండా మరో పది రోజులు గడువు ఇచ్చి ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి. మాదిగలకు అన్యాయం జరిగితే ఆందోళన చేపడతాం. మాదిగలను క్రిస్టియన్ మాదిగ అని కాకుండా హిందూ మాదిగగా నమోదు చేయాలి.

– కొమ్ము సుజన్, మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు

కుల గణన తప్పుల తడకగా ఉంది

ఒంగోలు వన్‌టౌన్: కులగణన తప్పుల తడకగా ఉందని, తప్పులను సరిదిద్దుకునేందుకు జనవరి 30వ తేదీ వరకు గడువు పొడిగించాలని జైభీం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో పాటిస్తున్న విధానాలకు నిరసనగా సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో దాసరి సుందరరావు, లింగంగుంట్ల రామలింగం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జైభీం ఫౌండేషన్ నాయకులు

రాజ్యాంగాన్ని అవహేళన చేశారు

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై ధ్వజమెత్తిన వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న సీపీఐఎం నాయకుడు, నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య అంతరాలు తగ్గించేందుకు కృషి చేసిన బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. అంబేడ్కర్‌ను అవమానిస్తూ హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం ప్రకాశం భవనం వద్ద వామపక్ష పార్టీలు ధర్నా చేపట్టాయి. ఈ నిరసనకు సీపీఐ, సీపీఎం నగర నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎం.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంటులోనే అవమానిస్తూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే ఆయనను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఇప్పటి వరకు ప్రధాన మంత్రి మోదీ ఖండించక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. అమిత్ షా వ్యాఖ్యలను పౌరులంతా వ్యతిరేకిస్తున్నారని, ఆయన రాజీనామా చేసి మంత్రి వర్గం నుంచి పక్కకు తప్పుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ నాయకురాలు ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ ముష్కరులకు తొత్తులుగా వ్యవహరించిన సావర్కర్ వారసుల వ్యవహార శైలిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగానే అమిత్ షా తప్పుడు వ్యాఖ్యలు చేశారని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు బి.పద్మ, ఎం.విజయ, ఆర్.లక్ష్మి, కంకణాల రమాదేవి, ఎంఏ సాలార్, బాలకోటయ్య, బి.రఘురాం, ఆంజనేయులు, ఏవీ పుల్లారావు, సాయన్న, వీరారెడ్డి, ఆర్.వెంకటరావు, జయంత్‌బాబు, కోటేశ్వరరావు, శ్రీరాం శ్రీనివాసరావు, కరవది సుబ్బారావు, జాలా అంజయ్య పాల్గొన్నారు.

హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవ ఖైదు

ఒంగోలు: హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవ ఖైదు విధిస్తూ ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జి డి.రాములు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొత్తపట్నం మండలం కె.పల్లెపాలేనికి చెందిన అయిలా కోటిలింగం అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ పిచ్చయ్యను ఈతముక్కల బస్టాండ్ నుంచి ఆటోలో తనతోపాటు తీసుకెళ్లాడు. ఈతముక్కల పొలాల్లోని పేరంటాళ్ల కుంట వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించి అదే సీసాతో పిచ్చయ్య తలపై కొట్టి గాయపరిచాడు. పిచ్చయ్య మొలతాడును తొలగించి దాని సాయంతో పిచ్చయ్య గొంతుకు బిగించి హత్య చేశాడు. అనంతరం అతని శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని వాటిని ఒంగోలులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఒక వైపు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయడంతో నిందితుడు కోటిలింగం వీఆర్‌వో ఎదుట హాజరై నేరం ఒప్పుకోవడంతో అప్పటి కొత్తపట్నం ఎస్సై ఫిరోజ్ ఫాతిమా కేసు నమోదు చేశారు. అప్పటి టూటౌన్ ఎస్సై రాఘవరావు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో ముద్దాయిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ 3వ అదనపు జిల్లా జడ్జి డి.రాములు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదించగా, సాక్షులను కోర్టులో హాజరుపరిచి నిందితునికి సకాలంలో శిక్షపడేలా చేసిన కొత్తపట్నం సీఐ మేడా శ్రీనివాసరావు, ఎస్సై వేముల సుధాకర్, కోర్టు కానిస్టేబుళ్లు జి.అంకిరెడ్డి, వి.ప్రసాద్‌లను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.


రన్నింగ్ అనంతరం ఇతర పరీక్షలకు వేచి ఉన్న అభ్యర్థులు


దేహదారుఢ్య పరీక్షలను ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్


రన్నింగ్‌లో దూసుకెళ్తున్న అభ్యర్థులు

నిఘా నీడన దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థుల కాలికి ట్యాగ్ బయోమెట్రిక్ బ్యాండ్

- కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు తొలిరోజు 600 మందికిగాను 235 మంది హాజరు
- 50 సీసీ కెమెరాలు..ఒక డ్రోన్ కెమెరాతో నిరంతర పర్యవేక్షణ
- పరీక్షల ప్రక్రియను ప్రారంభించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండులో దేహ దారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 5 గంటలకు ఎస్పీ ఏఆర్ దామోదర్ పరీక్షలను ప్రారంభించారు. తొలిరోజు 600 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 235 మంది మాత్రమే హాజరయ్యారు. ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా లేని 20 మంది వెనుదిరిగి వెళ్లగా 345 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. అమావాస్య లాంటి సెంటిమెంట్ల వలన కొంతమంది అభ్యర్థులు తొలిరోజు పరీక్షలకు హాజరుకాలేదని తెలుస్తోంది. ఈ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ పకడ్బందీగా ఏర్పాట్లు చేయించారు. ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. 50 సీసీ కెమెరాలు, ఒక డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్నారు. ఒక అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించగానే పరీక్షల సమాచారం కోసం వెదుక్కోకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు అత్యవసర వైద్య చికిత్స అందించేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏపీ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు సూచనల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన తరువాత ఎత్తు, ఛాతి కొలతలు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో సుమారు 75 శాతం అభ్యర్థులు అర్హత సాధించినట్లు తెలుస్తోంది. తొలిరోజు పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి.


అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అభ్యర్థుల వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం

పోలీసు ఉద్యోగాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలను ఎలాంటి అసౌకర్యాలు, అవకతవకలకు తావులేకుండా పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పరీక్షల వివరాలు, అభ్యర్థులకు దేహదారుఢ్య, పరుగు పందేలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో నమోదు చేసి భద్రపరుస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయ్యాయని చెప్పారు. ఎవరైనా సరే దళారులు పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం అనేది పూర్తిగా ప్రతిభ ఆధారంగానే వస్తాయని స్పష్టం చేశారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పీటీసీ డీఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీవో ఏఓ రామ్మోహన రావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, మహిళా పీఎస్ సీఐ సుధాకర్, పీటీసీ సీఐ రాజేష్, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి పాల్గొన్నారు.


అభ్యర్థుల ఎత్తును పరీక్షిస్తున్న పోలీస్ సిబ్బంది

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళన

- ఏపీటీఎఫ్ నేతల స్పష్టీకరణ


డీఈఓకు వినతిపత్రమిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యలను జనవరి 10వ తేదీలోగా పరిష్కరించకపోతే డీఈఓ కార్యాలయం ముందు ప్రత్యక్ష ఆందోళన చేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.జనార్దనరెడ్డి, డి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్‌కు ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల సామూహిక, వ్యక్తిగత సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉండటం వల్ల సర్వీస్ పరంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనవరి 10వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకపోతే డీఈఓ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేపట్టాలని ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అన్ని కేడర్ల సబ్జెక్టుల వారీ సీనియార్టీ జాబితా విడుదల చేయాలని కోరారు. ప్రమోషన్ కేడర్‌లో సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ కోసం పలువురు ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ ఉత్తర్వులు జారీ చేయకపోవడాన్ని తప్పుబట్టారు. 1996, 2002, 2014 డీఎస్సీ ఎస్జీటీల అప్రూవ్డ్ సీనియారిటీ లిస్టులు, అలాగే 2008 డీఎస్సీ తెలుగు లాంగ్వేజ్ పండిట్ అప్రూవుడ్ సీనియారిటీ లిస్టు జెరాక్స్ ప్రతులు ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్. మంజుల, పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు శేషారావు, లేవి ప్రసాద్, పి.హనుమంతరావు, కె.తిరుమల, రాష్ట్ర కౌన్సిలర్లు కె.రవి, ఎస్కే ఖాదర్‌బాషా, మండల శాఖ బాధ్యులు మౌలాలి, ఈమని శ్రీను, పరిటాల సుబ్బారావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్‌లో పితలాటకం!

- వితంతువులపైనా కక్షగట్టిన కూటమి సర్కారు
- నవంబర్ 1 నుంచి డిసెంబర్1 మధ్య వితంతువులైన వారికే నేడు పింఛను
- ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ 1 ముందు వరకు వితంతువులైన వారికి మొండిచేయి
- తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో గగ్గోలు పెడుతున్న అర్హులు
- నూతన పింఛను దరఖాస్తులపై నేటికీ పిల్లిమొగ్గలు
- సామాజిక పింఛన్లు తగ్గించేందుకు కొనసాగుతున్న కుట్రలు

బేస్తవారిపేట: ''కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తాం'' 2024 సార్వత్రిక ఎన్నికల వేళ చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ఇది. కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి అదే ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా 50 ఏళ్లకే పింఛను ఊసెత్తడం లేదు సరికదా, కొత్తగా పింఛను దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. పైగా వితంతు మహిళలకు అందించే పింఛన్లలోనూ కొర్రీలు పెడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు.. అర్హులైన వితంతు మహిళలను కలవరానికి గురిచేస్తున్నాయి. గడిచిన ఏడు నెలలుగా పింఛన్లు తగ్గించుకుంటూ వస్తున్న తీరు నగదు పంపిణీ గణాంకాలు చూస్తే స్పష్టమవుతుంది. ఈ ఏడాది మార్చిలో జిల్లాలో 2,98,888 మందికి పింఛన్లు అందగా నవంబర్‌లో ఆ సంఖ్య 2,85,438కి పడిపోయింది. పింఛను మొత్తం పెంచామని చెప్పి చంకలు గుద్దుకుంటున్న కూటమి నేతలు, కొత్త పింఛన్లు ఎందుకు మంజూరు చేయడం లేదో చెప్పడం లేదు. అసలు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశమే నేటి వరకు కల్పించకపోవడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా కక్షసాధింపు ధోరణితో తొలగింపు చర్యలకు పాల్పడటం సర్వత్రా చర్చనీయాంశమైంది.


GOVERNMENT OF ANDHRA PRADESH
SOCIETY FOR ELIMINATION OF RURAL POVERTY
(Dept. of Rural Development)
NTR - Administrative Block, PNBS, Vijayawada - 520001

G.Veerapandian, IAS.,
Chief Executive Officer

Sub:-SERP – NTR Bharosa Pension Scheme – Sanction of Spouse Pension – Standard Operating Procedure (SOP) – Issued – Reg.

In the reference cited, the Government has communicated the Minutes of the Meeting approved by the Hon'ble Minister for MSME, SERP, NRI Empowerment & Relations on NTR Bharosa Pensions held on 14.11.2024. Wherein, decision has been taken for sanction of spouse pension to support the deceased family under NTR Bharosa Pension Scheme.

In pursuance to the above instructions, the following Standard Operating Procedure (SOP) issued for sanction of spouse pension (widow):

Standard Operating Procedure (SOP) for Sanction of Spouse Pension

Objective: Spouse Pension(Widow) will be sanctioned in the event of death of existing pensioner under NTR Bharosa Pension Scheme every month to support the family.

ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు

కొంత మందికే లబ్ధి

ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం కొత్త పింఛన్లు కొందరికే అందనున్నాయి. వితంతువులు మాత్రమే కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. అది కూడా నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ ఒకటో తేదీ మధ్య పింఛన్ పొందుతున్న భర్త మృతి చెంది ఉంటే డిసెంబర్ నుంచి భార్యకు వితంతు పింఛను అందజేస్తామని స్పష్టం చేశారు. అంటే ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ ఒకటో తేదీ మధ్య పింఛను పొందుతున్న భర్తను కోల్పోయిన మహిళల పరిస్థితి ఏమిటనేది ప్రభుత్వం ఎటూ తేల్చలేదు. దీంతో వితంతువులు, వృద్ధులు సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్నారు. కనీసం వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటో పాలకులే సెలవివ్వాలి.

గతంలో అర్హులందరికీ పింఛను

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛను మంజూరయ్యేది. ఎలాంటి షరతులు, నిబంధనలు ఉండేవికావు. దరఖాస్తులను సైతం వలంటీర్లే సచివాలయాలకు తీసుకెళ్లి ఆన్‌లైన్ చేసి, మంజూరైన వెంటనే ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇచ్చేవారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్న వాటిలో ఏ విధంగా కోత పెట్టాలనే దానిపై శ్రద్ధ చూపుతుండటంతో అర్హుల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అవకాశం లేదంటున్నారు


తొమ్మిది నెలల క్రితం నా భర్త వెంకటయ్య మృతి చెందాడు. ఎన్నికల సమయంలో కొత్త పింఛన్లు పెట్టుకునే అవకాశం లేదన్నారు. కూలీ పనులు చేసుకుంటేనే పూట గడిచేది. ఇప్పుడు కూడా మాకు కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదంటున్నారు.

– పాలకీటి మేరమ్మ, వితంతువు

సచివాలయం చుట్టూ తిరుగుతున్నా


రెండు నెలల క్రితం నా భర్త సామ్యేలు మృతి చెందాడు. రెండు నెలల నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. కొత్త పింఛన్లు పెట్టుకునేందుకు అవకాశం ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని చెబుతున్నారు. కూలీ చేసుకునే మాలాంటి నిరుపేదలకు పింఛను సకాలంలో వచ్చేట్లు ప్రభుత్వం అవకాశం కల్పించాలి.

– సొరకాయల మేరమ్మ, వితంతువు

ఒంటరిదాన్ని.. పింఛనివ్వండి


నా భర్త డానియేల్‌తో కలిసి చెన్నైలో పనులు చేసుకుంటూ బతికేదాన్ని. మా ఆయన చనిపోవడంతో సంవత్సరం కిందట మా స్వగ్రామం గలిజేరుగుళ్లకు వచ్చా. ఎన్నికల కోడ్ ఉందని చెప్పి కొత్త పింఛన్లు పెట్టలేదు. నాకు పిల్లలు లేరు, భర్త చనిపోవడంతో ఒంటరిగా బతుకుతున్నా. పింఛను ఇస్తే కొంత భరోసాగా ఉంటుంది.

– ఆర్లగడ్డ వెంకటమ్మ, వితంతువు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి!

- చోరీకి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురైనట్లు ప్రచారం

అర్థవీడు: గొర్రెలను దొంగిలించేందుకు వెళ్లిన నలుగురిలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్ గురై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. కాకర్లకు చెందిన పిక్కిలి రంగయ్య (55) అనే వ్యక్తి మరో ముగ్గురితో కలిసి శుక్రవారం రాత్రి గన్నేపల్లి నుంచి ఆటో తీసుకుని మొహిద్దీన్‌పురం గ్రామంలో గొర్రెల దొంగతనానికి వెళ్లారు. చోరీ చేసి వచ్చే క్రమంలో పొలంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి రంగయ్య మృతి చెందాడు. అయితే గుట్టుచప్పుడు కాకుండా మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేసి గుండె పోటుతో మరణించినట్లుగా చిత్రీకరించినట్లు గ్రామంలో వార్తలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారం సోమవారం వెలుగులోకి రావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విషయమై అర్థవీడు ఎస్సై మధుసూదన్‌ను వివరణ కోరగా మృతుడి కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి గతంలో కూడా పలుమార్లు గొర్రెల దొంగతనాలకు పాల్పడినట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది

బస్సు బోల్తా.. కనిగిరి యువకుడు దుర్మరణం

- బెంగళూరులో పరీక్ష రాసి వస్తుండగా ప్రమాదం

శ్రీనివాసపురం: ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సు బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు మృతి చెందగా మరికొందరు గాయపడిన ఘటన కర్ణాటకలో కోలారు జిల్లాలో జరిగింది. వివరాలు.. బెంగుళూరు నుంచి ప్రకాశం జిల్లా కనిగిరికి ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సు ఆదివారం రాత్రి 39 మంది ప్రయాణికులతో బయలుదేరింది. శ్రీనివాసపురం తాలూకాలోని రాయల్పాడు క్రాస్ వద్దకు చేరుకోగానే బస్సు డ్రైవర్ నియంత్రణ తప్పి పక్కనే ఉన్న 40 అడుగుల లోయలోకి బోల్తా కొట్టింది. ఘటనలో అనిల్‌రెడ్డి (23) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతనితో పాటు మరికొంతమంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానిక పోలీసులు అనిల్‌రెడ్డిని శ్రీనివాసపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రకాశం జిల్లాకు చెందిన అనిల్‌రెడ్డి ఆర్ఆర్‌బీ/ బ్యాంకింగ్ పోటీ పరీక్షను రాసి తిరిగివెళ్తూ మృత్యువాత పడ్డాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అందించారు.


బోల్తాపడిన స్లీపర్ కోచ్ బస్సు


అనిల్‌రెడ్డి మృతదేహం

'కృష్ణ'కృష్ణా ఇదేం పని?

- పట్టా భూమిలో సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నేత యత్నం
- అడ్డుకున్న కోయవారిపాలెం గ్రామస్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్:

అధికారం చేతిలో ఉంది, అడిగేవారు లేరన్న బరితెగింపుతో ఓ టీడీపీ నేత ఏకంగా పట్టాభూమిలో సీసీ రోడ్డు వేసేందుకు సిద్ధమయ్యాడు. దీంతో స్థల యజమానులతోపాటు పలువురు గ్రామస్తులు అడ్డుతగిలారు. ఈ సంఘటన కొండపి మండలం పెట్లూరు పంచాయతీ కోయవారిపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామ సర్వే నంబర్ 319–35లో ఆరుగురికి చెందిన పట్టా భూమి ఉంది. ఇందులో కొందరు గృహాలు నిర్మించుకున్నారు. ఆ స్థలంలోనే రాకపోకల కోసం దారి వదిలారు. పంచాయతీకి ఎలాంటి సంబంధం లేని ఆ దారిలో సీసీ రోడ్డు వేసేందుకు టీడీపీ నేత బొల్లినేని రామకృష్ణ ప్రయత్నించాడు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొలతలు వేస్తుండటంతో స్థానికులు, స్థల యజమానులు నిలదీశారు. సీసీ రోడ్డు తమకు అవసరం లేదని తేల్చిచెప్పారు. రోడ్డు నిర్మిస్తే రామాలయంతోపాటు తమ గృహాలు లోతట్టుగా మారి నీట మునుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నేత మాత్రం 'రోడ్డేసి తీరుతా.. ఎవరు అడ్డుకుంటారో చూస్తా' అని బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో పంచాయితీ పోలీసుల వద్దకు చేరింది. ఇరువర్గాలను బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. పీఆర్ ఏఈ ప్రసాద్‌ను వివరణ కోరగా 'ఆ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మించడానికి గ్రామస్తులు అడ్డుచెప్పడంతో ఆపేశామ'ని తెలిపారు.


సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసిన ప్రాంతం

హద్దు మీరితే తాట తీస్తాం

- ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక
- సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచన

ఒంగోలు టౌన్: జనవరి సంబరాల పేరుతో రౌడీయిజం చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎస్పీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు, దాబాలు ఇతర అవుట్‌లెట్లు నిర్దేశిత సమయాల్లో మూసివేయకుంటే చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడినా, లౌడ్ స్పీకర్లు, డీజేలు పెట్టినా, ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి ర్యాష్ డ్రైవింగ్ చేసినా చర్యలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. ట్రిపుల్ రైడింగ్, బైక్, కార్ రేసింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ప్రజా రవాణాకు అడ్డంకులు సృష్టించినా సహించేది లేదన్నారు. డీఎస్పీల పర్యవేక్షణలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో మంగళవారం సాయంత్రం నుంచి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

స్థల వివాదంలో దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: స్థల వివాదంలో దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ మాట్లాడుతూ మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడుకు చెందిన పల్లెపు శ్రీలక్ష్మి, రాంబాబులు ఇంట్లో ఉండగా అదే గ్రామానికి 15 మంది దాడి చేసి గాయపరిచారని తెలిపారు. బాధితులకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స కోసం చేరినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిలకా శ్రీను కేసు నమోదు కాకుండా అడ్డు పడుతున్నారని, ఈ విషయంపై ఎస్పీ విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సంపత్‌కుమార్ దశరథ్‌రామ్, జయకుమార్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గుంతల రోడ్డు!

- బైక్ అదుపు తప్పి పడిపోయిన దంపతులు
- గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొని భార్య మృతి
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న భర్త

సంతనూతలపాడు:

గతుకుల రోడ్డులో బైక్ అదుపుతప్పి పడిపోయిన దంపతులను గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొనడంతో భార్య మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాద సంఘటన సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడు సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వేములపాడుకు చెందిన రాయిని వేణు, శ్రీలత(37) దంపతులు ఒంగోలు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. తక్కెళ్లపాడు గ్రామం దాటిన తర్వాత రోడ్డుపై ఉన్న గుంతల్లో బైక్ అదుపు తప్పి పడిపోయారు. అదే సమయంలో మద్దులూరు వైపు నుంచి సంతనూతలపాడు వైపు వెళ్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొనడంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే శ్రీలత మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీలత భర్త వేణు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. శ్రీలత మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు సంతనూతలపాడు పోలీసులు తెలిపారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.అజయ్‌బాబు తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మార్కాపురం: ఆర్టీసీ హైర్ బస్సు కల్వర్టును ఢీకొట్టిన సంఘటన సోమవారం ఉదయం మార్కాపురం చెరువుకట్టపై చోటుచేసుకుంది. మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తున్న బస్సు చెరువుకట్ట అలుగు దాటిన తర్వాత ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో సాగర్ పైప్‌లైన్ సంపు కల్వర్టును ఢీకొట్టింది. ఈ సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో అంతా భయకంపితులయ్యారు. ప్రమాదంలో బస్సు ఫుట్ బోర్డు దెబ్బతినగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికులందరినీ మరో బస్సులో పంపేందుకు డిపో మేనేజర్ నరసింహులు ఏర్పాట్లు చేశారు. కాగా, మార్కాపురం చెరువు కట్ట రోడ్డు గోతులమయమైంది. ఇటీవల 4 రోజులపాటు చెరువుకట్ట రోడ్డు మూసి వేసి చిల్లకంప తొలగించారు. గుంతలను తాత్కాలికంగా పూడ్చినా వర్షాలతో పరిస్థితి యథావిధిగా మారింది.


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు